'విద్యుత్' బాదుడుపై నిరంతర పోరాటం

- సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు
- అలంకార్ సెంటర్ ధర్నా చౌక్‌లో పోరుబాట


విద్యుత్ చార్జీలు తగ్గించాలని నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్తున్న మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం తగ్గించే వరకు వైఎస్సార్ సీపీ నిరంతర పోరాటం చేస్తూనే ఉంటుందని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో శుక్రవారం కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమం చేసింది. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలియజేస్తూ.. అందరూ రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తర్వాత డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, కార్పొరేటర్లతో కలిసి ర్యాలీగా వెళ్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ.. అబద్ధాలు, మోసాలతో అధికారంలోకి రావడం, తీరా వచ్చాక ఇచ్చిన హామీలను విస్మరించడం చంద్రబాబుకు షరామామూలేనని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లోనే రూ.15,500 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు ఓ మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరోమాట చెప్పడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. కరెంట్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని పైగా వినియోగదారులే విద్యుత్ అమ్ముకునేలా చేస్తానని ప్రతిపక్షంలో ఉన్న ఐదేళ్లు బాబు చెప్పిన మాటలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. గతంలోనూ కరెంట్ చార్జీలు తగ్గించాలని అడిగిన అమాయకులపై బషీర్‌బాగ్‌లో కాల్పులు జరిపించిన చరిత్ర చంద్రబాబుదని గుర్తుచేశారు.


మీడియాతో మాట్లాడుతున్న విష్ణు


నగరంలో జరిగిన పోరుబాటలో సామాన్యులు

మంత్రులది మిడిమిడి జ్ఞానం

కేబినెట్ మంత్రులందరూ మిడి మిడి జ్ఞానంతో మాట్లాడుతూ.. 24 గంటలూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జపం చేస్తున్నారని మల్లాది విష్ణు పేర్కొన్నారు. ఓ వైపు రూ. 15,485 కోట్ల విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపుతూనే.. మరోవైపు నిస్సిగ్గుగా అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్రం మరో శ్రీలంక అయిపోతుందని మొసలి కన్నీరు కార్చిన కూటమి నేతలే.. ఆరునెలల కాలంలోనే రూ. లక్ష కోట్ల అప్పు చేయడంపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పైగా అమరావతి అభివృద్ధి పేరుతో రూ. వేల కోట్ల అప్పులు తీసుకువస్తూ.. చివరకు ఆ భారాన్ని ప్రజల నెత్తిన రుద్దుతున్నారని నిప్పులు చెరిగారు. చంద్రబాబు చేతగానితనంతో ప్రజలు రోడ్డుపైకి వచ్చారని దుయ్యబట్టారు.

సెంట్రల్ పరిధిలో

సెంట్రల్ నియోజకవర్గంలో కేటగిరి–1కింద 1,27,325 మంది గృహ వినియోగదారులకు గాను ప్రతినెలా 21.80 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం జరుగుతోందని మల్లాది విష్ణు తెలిపారు. కేటగిరి–2లో 21,669 మంది వినియోగదారులకు 7.73 మిలియన్ యూనిట్లు., కేటగిరి–3లో 322 మంది వినియోగదారులకు 0.31 మిలియన్ యూనిట్లు., కేటగిరి–4 కి సంబంధించి 979 మంది వినియోగదారులకు 0.88 మిలియన్ యూనిట్ల వాడకం జరుగుతోందన్నారు. మొత్తంగా 1,50,295 విద్యుత్ కనెక్షన్లకు గానూ ప్రతినెలా 30.73 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందని చెప్పారు. ఈ లెక్కన అదనపు వడ్డింపులతో కలిపి నియోజకవర్గ ప్రజలపై రూ. 200 కోట్ల భారం పడుతున్నట్లు మల్లాది విష్ణు వివరించారు. జగన్ ప్రభుత్వంలో విద్యుత్ సమర్థ వినియోగంలో జాతీయ స్థాయిలో అనేక అవార్డులు వచ్చాయని మల్లాది గుర్తు చేశారు. చంద్రబాబు వల్లే విద్యుత్ రంగం నాశనమైందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి పేదలపై చార్జీల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత కరెంటును పునరుద్ధరించాలన్నారు. లేకపోతే ప్రజలపక్షాన వైఎస్సార్ సీపీ పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యరగొర్ల తిరుపతమ్మ శ్రీరాములు, అలంపూర్ విజయలక్ష్మి, ఇసరపు దేవీ రాజా రమేష్, కొండాయిగుంట మల్లీశ్వరి, జానారెడ్డి, పార్టీ నాయకులు ఎ.రవిచంద్ర, వేదాంతం చైతన్య, బండెల కిరణ్‌కుమార్, డివిజన్ ఇన్‌చార్జిలు, కోఆర్డినేటర్లు, పార్టీ శ్రేణులు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

300 మందికి ఉచిత పరీక్షలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): కోస్టల్ బ్యాంక్ రజతోత్సవం పురస్కరించుకుని ప్రజాశక్తి నగర్ బ్రాంచిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆ బ్యాంకు ఖాతాదారులు, ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, నేత్ర దంత వైద్యులు పాల్గొని సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. రక్తపోటు, మధుమేహం, ఈసీజీలతో పాటు, ఎముకల సాంద్రత పరీక్షలు చేసి, అనారోగ్య లక్షణాలు ఉన్న వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శిబిరంలో దీపక్ హాస్పటల్ డాక్టర్ ముక్తినేని వెంకట మధుసూదనరావు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. తొలుత వైద్య శిబిరాన్ని స్వాతి ఎడిటర్ వేమూరి బలరామ్ ప్రారంభించగా, బ్రాంచి హెడ్ జి. శశాంక తదితరులు పాల్గొన్నారు.

కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కస్టమర్ల విశ్వాసం, ఉద్యోగుల అంకిత భావంతో బ్యాంక్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందిస్తోందని కోస్టల్ బ్యాంక్ మేనేజర్ ఉండవల్లి రాంబాబు అన్నారు. ఏలూరు రోడ్డు సీతారాంపురం కోస్టల్ బ్యాంక్‌లో శుక్రవారం బ్యాంక్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి లోకల్ ఏరియా బ్యాంకు కోస్టల్ బ్యాంక్ ఏరియా బ్యాంక్ లిమిటెడ్ అన్నారు. బ్యాంక్ కస్టమర్‌లు కాంతీలాల్ పటేల్, కోటగిరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వినియోగదారులకు అవసరమైన సేవలను ఎప్పటికప్పుడు అందిస్తున్న బ్యాంక్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): అంబేడ్కర్ కాలనీ షీయోను ప్రార్థన మందిరంలో శుక్రవారం ప్రార్థన మందిరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను రెవరెండ్ డాక్టర్ కనమాల వరప్రసాద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని ప్రజలు.. ప్రభువు ఆశీస్సులతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో ప్రతి విశ్వాసకుడికి నూతన సంవత్సర క్యాలెండర్‌ను అందించి ఏసు దీవెనలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మందిరం సంఘస్తులు విశ్వాసకులు పాల్గొన్నారు.

రేపు శారద కళాశాల గోల్డెన్ జూబ్లీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని శారద కళాశాల స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 29న గోల్డెన్ జూబ్లీ, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామనారాయణ తెలిపారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శారద కళాశాల 50 ఏళ్లుగా ఎందరో విద్యార్థులకు ఉన్నత విద్యను అందించిందని తెలిపారు. ఇక్కడ విద్యను అభ్యసించిన వారు ఎంతో మంది నేడు దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. గోల్డెన్ జూబ్లీ సందర్భంగా వారందరిని ఒకే వేదికపైకి తీసుకురావడానికి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాశాల ప్రారంభం నాటి నుంచి ప్రస్థానాన్ని వివరించారు.

సీఎస్‌సీ ఇండియాతో ఎస్సార్కే ఒప్పందం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలతో కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ (సీఎస్‌సీ ఇండియా) ఉపాధి నైపుణ్య శిక్షణ అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎస్‌సీ ఇండియా సలహాదారు వై. రామ్మోహన్‌రావుతో ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు అవగాహన ఒప్పంద పత్రాలను పరస్పరం అందుకున్నారు. రామ్మోహన్‌రావు మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సి–డాక్ ద్వారా విద్యార్థులకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులకు ఎన్ఐఈఎల్ఐటీ 3డీ ప్రింటింగ్, రోబోటిక్ ప్రాసెసింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై ఉపాధి నైపుణ్యాలను అందిస్తామని పేర్కొన్నారు.

డిస్‌ప్లే డివైజ్ ఫీజు కమిటీ ప్రత్యేక సమావేశం



మాట్లాడుతున్న వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్)చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలో వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసుకునే డిస్‌ప్లే డివైజ్‌లు అన్నింటికీ అనుమతులు ఉండాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు ఆయన పలు ఏజెన్సీలతో డిస్‌ప్లే డివైజ్ ఫీజు ప్రత్యేక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిస్‌ప్లే డివైజ్‌తో సంబంధం ఉన్న ఏజెన్సీలన్నీ త్వరితగతిన వీఎంసీ అనుమతులు తీసుకోవాలని, నగరంలోని వివిధ ప్రాంతాల్లో 28 డిస్‌ప్లే డివైజెస్‌కు సంబంధించిన ఏజెన్సీలు ఉన్నాయన్నారు. అందులో ఎనిమిది ఏజెన్సీలు పాల్గొన్నాయని, తదుపరి సమావేశంలో అందరూ హాజరవ్వాలని చెప్పారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దృష్టికి వచ్చిన పర్మిషన్ లెటర్, ట్రేడ్ లైసెన్స్, నగరపాలక సంస్థకు పెట్టుకున్న అర్జీలు పరిశీలించారు. వీఎంసీకి ఏజెన్సీలు చెల్లించాల్సిన బకాయిలపై ఆరా తీశారు. సమావేశంలో కమిటీ కన్వీనర్ వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీ ఎస్వీ ప్రసాద్, సభ్యులు జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ, ఇతర టౌన్ ప్లానింగ్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో డేటాసైన్స్ అత్యంత కీలకం


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కోటారెడ్డి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రానున్న కాలంలో అన్నిరంగాల అభివృద్ధికి డేటా సైన్స్ అత్యంత కీలకంగా మారనుందని విట్ ఏపీ ఉప సంచాలకులు డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డేటాసైన్స్ అండ్ ఎంసీఏ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో స్ప్రింగర్ కాన్ఫరెన్స్ పేరుతో డేటాసైన్స్‌పై అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతూ కొత్త సాంకేతికతలను అన్వేషించడంలో డేటా సైన్స్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. భవిష్యత్‌ను నడిపించే సహకార సంబంధాలను పంచుకోవడం వంటి నూతన ఆవిష్కరణలకు డేటా సైన్స్ తోడ్పాటునందిస్తుందన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ డేటాసైన్స్ రంగంలో అద్భుతమైన ప్రగతి చోటు చేసుకుందన్నారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులపై పట్టు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా సదస్సులో పలువురు సమర్పించిన పరిశోధనా పత్రాల సావనీర్‌ను అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, సంయుక్త కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి, డాక్టర్ సురేష్‌బాబు, విభాగాధిపతి డాక్టర్ షేక్ అక్బర్, కోఆర్డినేటర్ నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ ప్రారంభం

కళాశాల డిపార్ట్‌మెంట్ ఏఐ ఆధ్వర్యంలో డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రారంభ సభలో కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి వర్క్‌షాప్‌లు కొత్త ఆలోచనలకు రూపునిస్తాయని వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ షణ్ముఖరావు, డాక్టర్ ఎస్వీ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేట్ పరం చేయొద్దు

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా


లెనిన్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఆటో, మోటార్ కార్మికులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ఆటో, మోటార్ రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు అన్నారు, లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్పడంతో మరింత భారం పడుతుందన్నారు. వీటిని ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. కె.దుర్గారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోటార్ వెహికల్ చట్ట సవరణలు చేసి ఆటో, మోటార్ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తోందన్నారు. బీజేపీ విధానాలను రాష్ట్రంలో టీడీపీ కూటమి అమలు చేస్తోందని మండిపడ్డారు. దీని వలన ఆటో, మోటార్ రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం వాగ్దానాలు అమలు చేయకుండా లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ విధానాన్ని ప్రైవేటుపరం చేస్తోందన్నారు. ఇప్పటికే వోలా, ఊబర్, రాపిడ్ వంటి విదేశీయాప్‌ల కారణంగా ఆటో కిరాయిలు తగ్గిపోయాయని, ఆటో, మోటార్ కార్మికుల కుటుంబాలు గడవలేని పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు.

పాలకులు పట్టించుకోపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తూర్పు సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.రూబెన్ కుమార్, సెంట్రల్ సిటీ ఆటోవర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, విజయవాడ సిటీ వర్కర్స్ యూనియన్ నగర నాయకులు డి. కోటయ్య, ఎ.నాగబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలు ఆచరణీయం


నిర్వాణ గ్రంథ ఆవిష్కరణలో ఇంతియాజ్, వేదికపై గుమ్మా సాంబశివరావు, గోళ్ల నారాయణరావు

విజయవాడ కల్చరల్: గౌతమ బుద్ధుని బోధనలు సర్వదా ఆచరణీయమని విశ్రాంత ఐఏఎస్ అధికారి మహ్మద్ ఇంతియాజ్ అన్నారు. కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన నిర్వాణ నవల ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కళావేదికపై శుక్రవారం నిర్వహించారు. నవలను ఆవిష్కరించిన ఇంతియాజ్ మాట్లాడుతూ బుద్ధుని బోధనలు, జీవితంపై సమగ్రమైన సమాచారం అందిస్తున్న నిర్వాణ గ్రంథం అనేక వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చిందన్నారు. కామ్రేడ్ జీఆర్‌కే సంస్థ వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ బుద్ధుని జీవితమే మన జీవన విధానం కావాలన్నారు. సాహితీవేత్త సత్యాజీ నవలను సమీక్షించారు. ఆవిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ గుమ్మా సాంబశివరావు, మంగళగిరి బుద్ధవిహార సభ్యుడు రేకా కృష్ణార్జున బోధి, విజయవాడ బుద్ధదమ్మ సంఘం కన్వీనర్ సురేంద్రనాథ్, సహాయ సంచాలకులు భూగర్భ జలవనుల శాఖ కన్వీనర్ విశ్వేశ్వరరావు బుద్ధుని జీవితం బోధనలు అంశంగా ప్రసంగించారు.

మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మరణవార్త తనను కలచివేసిందని, దేశానికి తీరని లోటని వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని రాజనీతిజ్ఞుల్లో ఆయన ఒకరని.. గొప్ప ఆర్థికవేత్త, ఉన్నత విద్యావంతులు, మృదుస్వభావి అని పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా, ప్రధాని హోదాలో రెండుసార్లు ఆయన నగరానికి విచ్చేశారని.. మన్మోహన్‌సింగ్‌కు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. దేశ అభివృద్ధికి ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు ప్రజలకు ఎల్లవేళలా గుర్తుంటాయని పేర్కొన్నారు. ఆయన మరణం యావత్ దేశానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

నేటి నుంచి బాలోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రోత్సహించడానికి విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏటా బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘ చైర్మన్ మురళీ మోహన్ అన్నారు. ముత్యాలంపాడులో శుక్రవారం విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించబోయే బాలోత్సవం కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28, 29 తేదీల్లో ఎనికేపాడు విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలలో 11వ బాలోత్సవం కనులపండువగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. రెండు రోజుల పాటు జరిగే బాలోత్సవంలో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన 10 వేలకు పైగా విద్యార్థులు పాల్గొని సృజనాత్మకతను ప్రదర్శిస్తారని తెలిపారు. బాలోత్సవంలో ఉత్తమ ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు పురస్కారాలు అందజేసి సత్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు, కార్యదర్శి సీహెచ్ హరినాథ్, కోశాధికారి ఈశ్వర్ బాలోత్సవం కరపత్రాలు ఆవిష్కరించారు.

కార్మికవాడలో వెలగని వీధి దీపాలు

పట్టించుకోని ఐలా అధికారులు


వంద అడుగుల రోడ్డులో పది స్తంభాలకు ఒకటే పని చేసేది


పంటకాలువ సెంటర్ వద్ద పని చేయని వీధి దీపాలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): కార్మికవాడ ఆటోనగర్‌లో వీధి దీపాల వెలుగులు కానరావడం లేదు. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకున్నవారే లేరు. అంతర్గత దారుల్లోనే ఇలాగే ఉంది. వందడుగుల రోడ్డులో అక్కడక్కడా వీధి దీపాలు వెలుగుతున్నాయి. ప్రధానంగా పంటకాలువ, సాయిహోటల్, కాటా సెంటరు జంక్షన్‌లో సైతం వెలుగునివ్వడంలేదు. సంబంధిత ఐలా అధికారులు మరమ్మతులు చేస్తున్నామని చెబుతున్నా అవి పని చేయడం లేదు.

ఏడాదికి రూ.15 లక్షలకుపైగా బిల్లుల చెల్లింపు

ఏటా వీధి దీపాలకు విద్యుత్ బిల్లులు, కొత్త బల్బులు వేయడానికి సుమారుగా రూ.15లక్షలకు పైగా ఐలా నుంచి చెల్లిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లిస్తున్నా కార్మికవాడలో వెలుగులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. విద్యుత్ బల్బులు పాడైపోయినా వెంటనే వేయడం లేదు. వీధి దీపాలు లేక పలుచోట్ల షాపుల్లో దొంగతనాలు జరుగుతున్నాయి. ఇక్కడ విలువైన ఇనుప వస్తువులు షాపులు, షెడ్లలో ఉంటాయి. ఇక్కడ పార్కింగ్ చేసిన వాహనాలు అపహరణకు గురైన సంఘటనలు లేకపోలేదు. లోడు చేసిన వాహనాలను సైతం తస్కరించిన సంఘటనలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

మరమ్మతులు చేయిస్తాం

ఎక్కడెక్కడ వీధిలైట్లు వెలగడం లేదో పరిశీలిస్తాం. బల్బులను వేయిస్తాం. మరమ్మతులకు గురైన చోట బాగుచేయించడానికి చర్యలు తీసుకుంటాం.

–కె.బాబ్జీ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్

ఆటోనగర్‌లో వీధి లైట్లు వెలగడంలేదు



ఆటోనగర్‌లో వీధి లైట్లు వెలగడంలేదు. జంక్షన్‌లో కూడా సరిగా వెలగడంలేదు. దొంగతనాలు తరచూ జరుగుతున్నాయి. లైట్లు పాడైపోయినప్పుడే వెంటనే వేయాలి. అధికారులు స్పందించాలి.

–రావి రామచంద్రరావు, ఆటోనగర్

రైతులకు 30 శాతం నష్టపరిహారం ఇవ్వాలి


కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, రైతులు

పాయకాపురం(విజయవాడరూరల్): నేషనల్ హైవే వెస్ట్ బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి నిర్మిస్తున్న విద్యుత్ టవర్ల విషయంలో నష్టపోయిన రైతాంగానికి భూమి విలువలో 30 శాతం చొప్పున నష్టపరిహారం చెల్లించాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కండ్రిక రైతులతో వెళ్లి కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో కలెక్టర్ లక్ష్మీశను ఆయన కలిశారు. కండ్రిక వ్యవసాయ భూములు విజయవాడ కార్పొరేషన్ పరిధిలో ఉండటంతో నష్టపోయిన రైతులకు 30 శాతం నష్టపరిహారం చెల్లించాలని మల్లాది విష్ణు కోరారు. సాంబిరెడ్డి అనే రైతు తనకున్న మూడున్నర ఎకరాల వ్యవసాయ పొలం మొత్తం విద్యుత్ టవర్ల నిర్మాణంలో పూర్తిగా నష్టం జరిగిందని అతనికి సాయం చేయాలని కలెక్టర్‌కు తెలియజేశారు. ప్రస్తుతం విద్యుత్ టవర్ల నిర్మాణంలో నష్టపోయిన రైతులందరికీ 10 శాతం చొప్పున నష్టపరిహారం చెల్లిస్తారని తర్వాత మిగిలిన మొత్తం రైతులకు అందజేయడానికి చర్యలు తీసుకొంటామని కలెక్టర్.. మల్లాది విష్ణుకు తెలియజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రైతులు మూళగొళ్ల రవీంద్రరెడ్డి, భీమిరెడ్డి సాంబిరెడ్డి, దేవిరెడ్డి బసివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.